



ఇదేం దోపిడీ!





క్యాన్సర్ పేషెంట్‌కు రూ.4 లక్షల ఆర్థిక సహాయం చేసిన జగ్గారెడ్డి

- ఆర్థికంగా బాధపడుతున్న క్యాన్సర్ పేషెంట్లకు అండగా నిలవాలి
- సమాజంలో మార్పు తేవడానికే నేను మీడియా ముందుకు వచ్చా
- దాతలకు పిలుపునిచ్చిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



క్యాన్సర్ పేషెంట్ రాణికి రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్న జగ్గారెడ్డి




క్యాన్సర్ పేషెంట్‌తో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్‌తో బాధపడుతున్న పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని సోమేశ్వరవాడకు చెందిన రాణి కొంతకాలంగా బ్రెస్ట్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న జగ్గారెడ్డి సోమవారం నాడు ఆమెను పరామర్శించారు. చికిత్స కోసం రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పు తేవడానికే తాను మీడియా ముందుకు వచ్చానన్నారు. క్యాన్సర్ వ్యాధి ఎవ్వరికీ రాకూడదని, ఈ వ్యాధి బారినపడ్డవారు మానసిక ఒత్తిడితో జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాన్సర్ వ్యాధి చికిత్స ఖర్చుతో కూడకున్నది కావడంతో పేదలు ఆర్థికంగా చితికిపోతున్నారని వాపోయారు. నియోజకవర్గానికి చెందిన పేద క్యాన్సర్ పేషెంట్లకు ఆర్థిక సహకారం అందించాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఇటీవల సదాశివపేటలో ఓ క్యాన్సర్ పేషెంట్‌కు రూ. 10 లక్షల ఆర్థిక సహాయం చేశానని, నేడు సంగారెడ్డికి చెందిన క్యాన్సర్ పేషెంట్ రాణికి రూ. 4లక్షల ఆర్థిక సహాయం చేశానని వివరించారు. గతంలోనూ సహాయం కోసం తన వద్దకు వచ్చినవారిని ఆదుకున్నానని, కానీ మీడియాలో రావడం తనకిష్టం ఉండదన్నారు. కానీ, రాష్ట్రంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న పేదలకు దాతలు ముందుకువచ్చి ఆదుకోవాలనే లక్ష్యంతోనే ఈసారి మీడియా ముందుకు వచ్చానని పేర్కొన్నారు. ఆయనవెంట టీపీసీసీ కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్ తదితరులు ఉన్నారు.

సర్దుబాటుపై వివాదం

విద్యార్థులు, టీచర్ల నిష్పత్తి ఆధారంగా తాత్కాలిక బదిలీలు
ఈ నెల 13 లోపు పూర్తి చేయాలని విద్యాశాఖ ఆదేశాలు
మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు



మెదక్ అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఈ నెల 13 లోపు సర్దుబాటు పూర్తిచేయాలనే విద్యాశాఖ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తమవుతున్నది. బడులు ప్రారంభం కానేలేదు.. విద్యార్థుల ప్రవేశాలపై స్పష్టత రానేలేదు.. అప్పుడే ఏ ప్రతిపాదికన సర్దుబాటు చేస్తారని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. కనీసం జూన్ 30 వరకు నమోదైన ప్రవేశాల ఆధారంగా సర్దుబాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు.

సర్దుబాటు ఇలా..

తాజా ఉత్తర్వుల మేరకు మెదక్ జిల్లాలో 366 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు అదనం(సర్ప్లస్) గా ఉన్నట్లు లెక్క తేల్చారు. మరోసారి క్షేత్రస్థాయిలో ఎంఈవోల నుంచి నివేదికలు తెప్పించుకొని అదనపు ఉపాధ్యాయుల తుది జాబితాను రూపొందించనున్నారు. ఈమేరకు అవసరమైన పాఠశాలలకు వీరిని కేటాయించనున్నారు. ఒక పంచాయతీ పరిధిలో టీచర్లు అవసరం లేకుంటే స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సర్దుబాటు చేస్తారు. కాంప్లెక్స్ పరిధిలోనూ అవసరం లేకుంటే మండల పరిధిలో, ఆ తర్వాత పక్క మండలం, జిల్లా పరిధిలో సర్దుబాటు చేయాలని విద్యాశాఖ ఆదేశాల్లో పేర్కొన్నది. పరస్పర బదిలీలకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశమివ్వొద్దని స్పష్టం చేసింది. ఇందుకోసం గత యూడైస్ వివరాలను ప్రతిపాదికగా తీసుకోనున్నారు. 10 మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలకు ఒకరు, 60 లోపు ఇద్దరు, 90 లోపు ముగ్గురు, 120 లోపు నలుగురు, 150 వరకు ఐదుగురు, 200 లోప ఆరుగురు, 200 దాటితే ప్రతీ 40 మందికి ఒక ఉపాధ్యాయుడి చొప్పున ఉండేలా సర్దుబాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 627, ప్రాథమికోన్నత 128, ఉన్నత పాఠశాలలు 146

మిగతా 8వ పేజీలో

తడబడి

విద్యార్థులకు సమస్యల స్వాగతం

శిథిలావస్థలో పలు పాఠశాలలు
లక్ష్యం చేరని అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం
నత్తనడకన నిర్మాణాలు, మరమ్మతులు
మరుగుదొడ్లు, నీటి సరఫరాలోనూ నిర్లక్ష్యమే
వేసవి సెలవుల్లో పనులు చేపట్టని వైనం
ఎల్లుండి నుంచే విద్యాసంస్థలు పునఃప్రారంభం
'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వాస్తవాలు వెలుగులోకి..



కంది మండలం చిమ్నాపూర్‌లో పాఠశాల భవనం దుస్థితి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 9: వేసవి సెలవులు ముగిసి రెండ్రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కాబోతున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత బడిలో అడుగు పెట్టబోతున్న విద్యార్థులకు పాత సమస్యలే స్వాగతం పలకనున్నాయి. సెలవుల్లో ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో పాఠశాలల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. శిథిలావస్థకు చేరిన భవనాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలు షరా మామూలే. తరగతి గదుల్లో పెచ్చులూడి కిందపడినా మరమ్మతులు చేయించనే లేదు. సమస్యల నడుమనే ఎల్లుండి నుంచి బడిగంట మోగనుంది. మెదక్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు

మిగతా 8వ పేజీలో



చిలప్‌చెడ్ మండలం జగ్గంపేటలో కూలిన ఓ తరగతి గది గోడ



అందోల్ మండలం డాకూరులో శిథిలావస్థలో ప్రాథమిక పాఠశాల భవనం

ప్రమాదం నీడన చదువులు

- కంది మండలం చిమ్నాపూర్‌లో దశాబ్దాల నాటి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం పడిందంటే విద్యార్థులు తడవాల్సిందే.
- చిలప్‌చెడ్ మండలం జగ్గంపేటలో ప్రాథమిక పాఠశాల గోడలు కూలిపోయాయి.
- అందోల్ మండలం డాకూరు ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. గతేడాది సెప్టెంబరులో స్లాబు పెచ్చులు ఊడిపడినా మరమ్మతులు చేయించలేదు.
- కొండాపూర్ మండలం మల్లేపల్లి పాఠశాల మరుగుదొడ్డిని స్టోర్‌రూంగా మార్చారు.
- టేక్మాల్ మండలం నల్లకుంట తండా పాఠశాలలో నీటి కనెక్షన్ లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. వర్షం వస్తే కిటికీల్లోంచి నీరు తరగతుల్లోకి వస్తుంది.
- నారాయణఖేడ్ మండలం అబ్బెంద ప్రాథమిక పాఠశాల గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతులు చేసినప్పటికీ అసంపూర్తిగా వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. ఇదే మండలం సత్యగామ పాఠశాల గదులు పెచ్చులూడుతున్నాయి.
-హవేలీఘనపూర్ సర్దన హైస్కూల్‌లో 176మందికి ఒకే మరుగుదొడ్డి ఉంది.
- పెద్దశంకరంపేట ప్రైమరీస్కూల్ గదులు శిథిలావస్థకు చేరాయి. తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు.
- నర్సాపూర్ మండల పరిషత్ పాఠశాల పూర్తిగా శిథిలమైంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి.
- శివ్వంపేట మండలం గూడూరు ప్రైమరీ స్కూల్ సజ్జ ఊడింది. ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారింది.



సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని మహిళా పెట్రోల్ బంకుని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

మహిళా పెట్రోల్ బంకులో ట్రయల్‌రన్ పరిశీలన

సంగారెడ్డి రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని మహిళా పెట్రోల్ బంకుకు కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం సందర్శించారు. ట్రయల్‌రన్ కొనసాగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోనే తొలిసారి సంగారెడ్డి పట్టణంలో మహిళా సామాఖ్య ఆధ్వర్యంలో పూర్తిగా మహిళలతో నడిచే పెట్రోల్‌బంక్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ పెట్రోల్ బంక్‌లో ఇద్దరు మేనేజర్లు, పన్నెండు మంది ఆరపరేటర్లుగా మహిళలే విధులు నిర్వహిస్తారని వెల్లడించారు. బంక్‌లో పటిష్టమైన రక్షణ కల్పిస్తామని చెప్పారు. వినియోగదారులకు ఉత్తమ సేవలందించాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో పీడీ జ్యోతి, అదనపు పీడీ జంగారెడ్డి తదితరులు ఉన్నారు.

ఏరువాక సాగేదెలా?

ఎరువులు పిరం.. విత్తనాలు భారం

వేలల్లో ట్రాక్టర్ కిరాయి.. వందల్లో కూలి
పెరిగిన ఖర్చుతో రైతులకు తడిసిమోపెడు



అక్కన్నపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఏరువాక వేళ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ట్రాక్టర్ కిరాయిలు, ఎరువులు, విత్తనాల ధరలు, కూలీల రేట్లు గణనీయంగా పెరిగిపోవడంతో సాగు భారంగా మారుతోంది. దీంతో అన్నదాతలు సాగు విషయంలో మల్లగుల్లాలు పడుతున్నారు. నేల తల్లిని నమ్ముకుని ఏటా వ్యవసాయంలో నష్టాలే చవి చూస్తున్నామని వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, కూరగాయలు ప్రధానంగా సాగు చేయనున్నారు. ఏరువాక పున్నం దగ్గరలో ఉండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

యాంత్రీకరణతో తడిసిమోపెడు

ఒకప్పుడు పల్లెల్లో ప్రతీ ఇంటి ముందు కాడెద్దులు, పశువులు, వ్యవసాయ సామగ్రి కనిపించేవి. కానీ కాలక్రమేణా ఎడ్ల పోషణ భారంగా మారడం, కూలీలు దొరక్కపోవడం, కూలీ రేట్లు ఎక్కువ కావడంతో సేద్యపు ఎడ్లు, పనిముట్ల స్థానాన్ని ట్రాక్టర్లు, ఇతర యంత్రాలు ఆక్రమించాయి. దున్నకం మొదలు కొని, మందుల పిచికారీ, పంట కోత వరకు యంత్రాలపైనే ఆధారపడక

మిగతా 6వ పేజీలో

ఎకరం వరి పంట సాగుకు అయ్యే ఖర్చు

నారుమడి దున్నడానికి	రూ. 1500
25 కిలోల వరి విత్తనాలు	రూ. 1,100
పొలం దున్నడానికి	రూ. 7,500
నాటు వేసేందుకు (8 మంది కూలీలు)	రూ. 4,000
కలుపు తీయడానికి	రూ.3000
ఎరువులు, పురుగుల మందులు	రూ. 10 వేలు
వరి కోతకు ఎకరానికి	రూ.3000



సంగారెడ్డి నుంచి జోగిపేట బస్సు చార్జీ పెంచకముందు రూ.40 టికెట్



చార్జీలు పెంచిన తర్వాత సంగారెడ్డి నుంచి జోగిపేటకు రూ.50 టికెట్

బస్ టికెట్‌పై టోల్ భారం

సోమవారం నుంచి రూ.10 పెంచిన ఆర్టీసీ

సంగారెడ్డి అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : టోల్‌గేట్ చార్జీల పెంపు ఆర్టీసీ ప్రయాణికులపై ప్రభావం చూపింది. ఏప్రిల్ 1 నుంచి వాహనదారుల టోల్ చార్జీలను కేంద్రం పెంచిన విషయం తెలిసిందే. దీంతో, ఆర్టీసీ కూడా ఆ భారాన్ని ప్రయాణికులపైనే మోపుతూ టికెట్ ధరలను పెంచింది. సంగారెడ్డి జిల్లాలోని తాడ్దాన్‌పల్లి, కంకోల్, గుమ్మడిదలలో హైవేలపై టోల్‌గేట్లు ఉన్నాయి. అయా రూట్లలో వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో సోమవారం నుంచి టికెట్‌పై రూ.10 చార్జీలను అదనంగా వసూలు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. అయితే, టోల్ చార్జీల భారం ప్రయాణికులపై మోపడంపై పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.



నారాయణఖేడ్ మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన పశువులు, ఎద్దుల అలంకరణ సామగ్రి

మార్కెట్లలో ఏరువాక పున్నమి సందడి

నారాయణఖేడ్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభంలో పల్లె ప్రజలు జరుపుకునే తొలి పండుగ ఏరువాక పున్నమి ఈ నెల 11న ఉండడంతో మార్కెట్లలో సందడి నెలకొంది. మృగశిర కార్తె ప్రవేశించిన అనంతరం వచ్చే పౌర్ణమిని ఏరువాక పౌర్ణమిగా జరుపుకుంటారు. ఆ రోజు రైతులు వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. ఎద్దులు, ఆవులు, పశువులను శుభ్రంగా కడిగి అలంకరిస్తారు. ఆలయాల చుట్టూ ఎడ్ల బల్లతో ప్రదక్షిణ చేస్తారు. ఏరువాక ముందా, ఏరు ముందా అనట్లు ఆనందోత్సవాల మధ్య పండుగ జరుపుకుంటారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ.. ఎస్పీ అభినందన

12తులాల బంగారం, నగదు ప్రయాణికుడికి అందజేత

సంగారెడ్డి క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రయాణికుడు ఆటోలో మర్చిపోయిన బంగారం, నగదు ఉన్న బ్యాగును జాగ్రత్తగా అప్పగించి నిజాయితీ చాటుకున్నాడో ఆటో డ్రైవర్. మల్కాపూర్‌లో బంధువుల ఇంటికి శుభకార్యానికి వచ్చిన కల్హర్ మండలానికి చెందిన శ్రీనివాస్ గౌడ్, తిరిగి ఇంటికి వెళ్లడానికి సోమవారం ఉదయం మల్కాపూర్‌లో ఆటో ఎక్కి సంగారెడ్డి కొత్త బస్టాండ్‌కు వచ్చాడు. అయితే, 12.50 తులాల బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగును ఆటోలోనే మర్చిపోయాడు. ఆటోలో బ్యాగును గమనించిన సంగారెడ్డి పట్టణంలోని నాల్సాబ్‌గడ్డకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ ఖదీర్ పట్టణ పోలీసుస్టేషన్‌లో అప్పగించాడు. బ్యాగు లేదని గమనించిన శ్రీనివాస్‌గౌడ్ పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా ఆటోడ్రైవర్ అప్పగించినట్లు తెలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ సీఐ రమేష్, అదనపు ఎస్పీ సంజీవరావు ద్వారా విషయం తెలుసుకున్న ఎస్పీ పంకజ్ ఆటోడ్రైవర్‌ను తన కార్యాలయానికి పిలిపించుకుని సత్కరించారు. అతడి చేతనే బ్యాగును ప్రయాణికుడికి ఇప్పించారు.



బ్యాగును ప్రయాణికుడికి అప్పగిస్తున్న ఆటోడ్రైవర్ ఖదీర్, ఎస్పీ పంకజ్



మాచునూర్ శివారులో ఓ రైతు పారబోసిన టమాటా

ధర డమాల్.. టమాటా రైతు కుదేల్

ఝరాసంగం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రతాసారి వేసవిలో రైతును లాభాలతో మురిపించే టమాటా ఈసారి ముంచేసింది. మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులు పెంటపై పారబోస్తున్నారు. ఇటీవల వర్షాల కారణంగా చేతికొచ్చిన పంట కుళ్లిపోయింది. అక్కడోఇక్కడో బాగున్న పొలాలను కాపాడుకుని, వ్యయప్రయాసలకోర్చి టమాటా తెంపి మార్కెట్‌కు చేర్చినా ధర లేకపోవడంతో రవాణా చార్జీలు కూడా రావడం లేదని వాపోతున్నారు. ఝరాసంగం మండలంలో వందల ఎకరాల్లో టమాటా పండించిన రైతులు తీవ్రంగా నష్టపోయారు.

డయాగ్నోస్టిక్ సెంటర్‌లో షార్ట్‌సర్క్యూట్

● కాలిపోయిన ఫర్నిచర్, స్కానర్



కాలిపోయిన ఫర్నిచర్, స్కానర్

మెదక్ కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి ఫర్నిచర్, స్కానర్, సిస్టమ్స్ దగ్ధమైన సంఘటన మెదక్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం జరగ్గా.. సోమవారం వెలుగులోకి వచ్చింది. షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి స్లాబ్‌కు, ఫాల్ సీలింగ్‌కు పైన ఉన్న థర్మకోల్, ఫ్యాన్ కాలిపోయి కిందపడింది. టేబుల్ వద్ద ఉన్న చైర్, ప్రింటర్, మౌస్, కిబోర్డు, జీపీఎస్, సీపీయూ, మానిటర్, బార్‌కోడ్ స్కానర్స్ కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనతో హబ్‌లోని అన్ని రూముల్లో నల్లటి పొగ చేరింది. సోమవారం ల్యాబ్‌కు చేరుకున్న సిబ్బంది అక్కడి పరిస్థితి గురించి సూపరింటెండెంట్ సునీతాదేవికి తెలియజేశారు. ఉదయం హబ్ పరిసరాలను పరిశీలించిన ఆమె ఘటనకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించామని, పరీక్షలకు అంతరాయం కలుగకుండా త్వరలోనే పునరుద్ధరిస్తామని చెప్పారు.

ఇదేం దోపిడీ..!

● కొర్రీలు పెడుతున్న మిల్లర్లు
● రైతులపై పగబట్టిన ప్రకృతి
● నాణ్యత లేదంటూ క్వింటాల్‌కు 10 కిలోల ధాన్యం కట్
● ఆందోళన చెందుతున్న అన్నదాతలు



అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని లారీలో తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

అల్లాదుర్గం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం విక్రయించేందుకు రైతులు ఆపసోపాలు పడాల్సి వస్తుంది. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం ఓ వైపు భరోసా ఇస్తున్నా.. కొందరు మిల్లర్లు మాత్రం ఇవేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తూ ధాన్యం నాణ్యత పేరుతో కొర్రీలు పెడుతూ నిలువు దోపిడీ చేస్తూ క్వింటాల్ ధాన్యానికి 10 కిలోలు కట్ చేస్తూ తమను నట్టేట ముంచుతున్నారని మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వం పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రానికి మండలంలోని వెంకట్రావుపేట, రెడ్డిపల్లి గ్రామానికి కొందరు రైతులు ధాన్యాన్ని విక్రయించగా.. కొనుగోలు చేసిన నిర్వాహకులు ఆ ధాన్యాన్ని సిద్దిపేట జిల్లాకు, మెదక్ జిల్లాలోని పెద్ద శంకరంపేటలోని రైసుమిల్లుకు మూడురోజుల క్రితం తరలించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈ ధాన్యం నాణ్యత లేదని, నల్లబడిందంటూ మిల్లర్లు తిరస్కరించడంతో సొసైటీ చైర్మన్ దుర్గారెడ్డి, కార్యదర్శి శివగౌడ్ రైస్ మిల్లర్లను సముదాయించారు. కాగా సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ మిలర్లు క్వింటాల్‌కు 4 కిలోలు కట్ చేస్తున్నాడని, ఇక్కడ కూడా 10 కిలోలు కాకుండా 4 కిలోలు కట్‌చేస్తే బాగుండేదని రైతులు పేర్కొన్నారు. సోమవారం కురిసిన భారీ వర్షంతో ధాన్యం మరింత దెబ్బతినే అవకాశం ఉండడంతో రైతులు చేసేదేమీ లేక చివరికి క్వింటాల్‌కు 10 కిలోలు కట్ చేసేందుకు అంగీకరించడంతో మిల్లర్లు ధాన్యాన్ని అన్‌లోడ్ చేశారు.

జిల్లా అధికారులు చెప్పినా..

ధాన్యం నాణ్యత లేదంటూ మిల్లర్లు పెడుతున్న కొర్రీలపై 'ఆంధ్రజ్యోతి' పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డిని ఫోన్ విచారించగా, వర్షం కారణంగా ధాన్యం నల్లబడిందని మిల్లర్లు అధిక మొత్తంలో కోత విధించడంపై తాను జిల్లా మేనేజర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఆ అధికారి మిల్లర్‌కు ఆదేశించినా మొండికేశాడు. మూడురోజుల పాటు మిల్లు వద్దనే ధాన్యం లారీ ఉండగా సోమవారం ఆ రైతుల అంగీకారంతో ధాన్యంలో కోత విధించి అన్‌లోడ్ చేశారని తెలిపారు.

ఇందిర సౌర గిరి జలవికాసం అమలుకు చర్యలు : కలెక్టర్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందర సౌర గిరి జల వికాసం పథకం అమలుకు జిల్లాలో పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉద్యానవన, భూగర్భజల, అటవీశాఖతోపాటు వివిధ శాఖల అధికారులతో పథకం అమలుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఇందిర సౌర గిరి జల వికాసం కింద పైలెట్ ప్రాజెక్టుగా మెదక్ జిల్లాలోని 18 మండలాలను ఎంపిక చేసిందన్నారు. 2025-26 సంవత్సరానికి 85 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాలకు నోడల్ జిల్లాగా మెదక్ జిల్లా ఎంపికైందని చెప్పారు. ఆర్వోఆర్ పట్టా ఉన్న పోడు భూములు వర్షాధారం ద్వారానే సాగు చేస్తుండడంతో గిరిజనులు అభివృద్ధికి చర్యలు తీసుకుంటూ ఈ భూములకు నీటి సౌకర్యం కల్పించాలన్నదే ఉద్దేశమన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి నీలిమ, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. భూభారతి చట్టం అమలుతో ప్రజలు భూ సమస్యలు దూరమవుతాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం మెదక్ మండల పరిధిలోని రాజ్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సును కలెక్టర్ పరిశీలించారు.

ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

● బాలిక మృతి, ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో వైష్ణవి మృతదేహం, గాయపడ్డ బిక్షపతి, సాకేత్

పటాన్‌చెరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఓఆర్ఆర్‌పై సోమవారం జరిగినఘోర రోడ్డు ప్రమాదంలో బాలిక మృతిచెందగా.. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గండిపేట ప్రాంతానికి చెందిన బిక్షపతి, భార్య దీపికకు టైలరింగ్ నేర్పించడానికి ఇద్దరు పిల్లలు వైష్ణవి(12), సాకేత్‌ను తీసుకొని సిరిసిల్ల వెళ్లాడు. అక్కడ భార్యను వదిలేసి పిల్లలతో సోమవారం తిరిగి వస్తున్నాడు. ఔటర్ రింగ్ రోడ్డుపై పాటి సమీపంలో రోడ్డు పక్కనే ఆగిన టిప్పర్‌ను వెనకనుంచి బలంగా ఢీకొనడంతో వైష్ణవి అక్కడికక్కడే మృతిచెందగా, బిక్షపతి, సాకేత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న బీడీయల్ పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ ఇద్దరిని ప్రైవేటట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్స్‌తో గర్భిణి మృతి



జయశ్రీ(ఫైల్)

నాగల్‌గిద్ద, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఫిట్స్ వ్యాధితో గర్భిణి మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం కూబతండా పంచాయతీ పరిధిలోని లక్యతండాలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన జయశ్రీ(25) గర్భిణి. సోమవారం ఫిట్స్ రావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన కరస్‌గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నారాయణఖేడ్ నుంచి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో జయశ్రీ మృతిచెందిదని కుటుంబసభ్యులు తెలిపారు. జయశ్రీ మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బ్రెయిన్ హేమరేజ్‌తో ఫొటోగ్రాఫర్ మృతి

● నేత్రాలను దానం చేసిన కుటుంబసభ్యులు

కొండపాక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : బ్రెయిన్ హేమరేజ్‌తో సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసనగండ్ల గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ పబ్బా చంద్రశేఖర్ ఆదివారం మృతిచెందాడు. తండ్రి నేత్రాలను దానం చేస్తే ఇద్దరికీ కంటిచూపును ప్రసాదించవచ్చని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి చొడవరపు లింగమూర్తి మృతుడి కుమారుడు సాయితేజకు అవగాహన కల్పించారు. దాంతో కుటుంబసభ్యుల అనుమతితో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాసన్ టెక్నీషియన్ ఉదయ్ సహకారంతో మృతిని నేత్రాలను సేకరించి వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. చంద్రశేఖర్ అంత్యక్రియలు సోమవారం గ్రామంలో జరిగాయి.

ట్రాక్టర్, బైక్ ఢీకొని పలువురికి గాయాలు

చేగుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నార్సింగి మండలం నర్సంపల్లి రోడ్డు వద్ద సోమవారం చోటు చేసుకుంది. నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మైనుద్దీన్ వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన అబ్రమైన అనిల్ కుటుంబసభ్యులతో కలిసి ద్విచక్ర వాహనంపై నార్సింగిలో మల్లన్న పండుగకు వచ్చాడు. సోమవారం గ్రామానికి వెళ్తుండగా నర్సంపల్లి గ్రామ శివారులో ట్రాక్టర్ ఢీకొనడంతో అనిల్‌తో పాటు భార్య రేణుక, రిత్విక్, నైసిక నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన వారిని సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

సంగారెడ్డిలో బైక్ చోరీ

● సీసీ కెమెరాల్లో రికార్డు

సంగారెడ్డి క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగ ఓ బైక్ చోరీ చేశాడు. శాంతినగర్‌కు చెందిన సతీష్‌గౌడ్ తన బైక్ (ఏపీ 11 ఎఎం 2469)ను ఆదివారం రాత్రి ఇంటి బయట పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి బైక్ తాళం తీసి చోరీ చేశాడు. బైక్‌ను చోరీ చేస్తున్న దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బాధితుడు సతీష్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

206 గ్రాముల అల్ప్రాజోలం పట్టివేత

● నిందితుడి అరెస్ట్

నర్సాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : 206 గ్రాముల నిషేధిత అల్ప్రాజోలాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్సు సీఐ గోపాల్ వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం పెద్దచింతకుంటలో నివసించే వెంకటేశ్‌గౌడ్ కల్లులో మత్తు కోసం కలిపేందుకు నిషేధిత అల్ప్రాజోలాన్ని పలు దుకాణాలకు విక్రయిస్తున్నాడని జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పక్కా సమాచారం మేరకు అతడి ఇంట్లో దాడి చేశామన్నారు. ఈ దాడిలో సుమారు రూ.లక్ష విలువ చేసే 206 గ్రాముల మత్తు పదార్థం లభించిందన్నారు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఈ దాడిలో ఎస్‌ఐ బాలయ్య, సిబ్బంది చంద్రయ్య, ఎల్లయ్య, రాజు, రవి, నరేష్, హరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమి తిరిగి స్వాధీనం



అటవీభూమి స్వాధీనం చేసుకున్న అధికారులు, పోలీసులు

శివ్వంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఆక్రమించిన అటవీ భూమిని అటవీ అధికారులు సోమవారం తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు మండల పరిధి బోజ్యాతండా పంచాయతీ పరిధి జేగ్యాతండాకు చెందిన కొందరు గిరిజనులు శివ్వంపేట అటవీ సెక్షన్ పరిధి దొంతి బీట్ కంపాట్‌మెంట్ 348లో అటవీ భూమిని ఆక్రమించి దున్నుతున్నారు. నర్సాపూర్ ఎఫ్ఆర్‌వో అరవింద్ ఆదేశాలమేరకు శివ్వంపేట పోలీసుల సహకారంతో నర్సాపూర్ రేంజ్ ఫారెస్ట్ సిబ్బంది ఆక్రమణకు గురైన భూమిని సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలోకి మళ్లీ వెళ్లకుండా ఎక్స్‌కవేటర్ సహాయంతో కందకాలు తవ్వించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్‌వో శ్రీధర్ ఆచార్య మాట్లాడుతూ ఎవరైనా అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సిద్ధిరాం సింగ్, ఎఫ్ఎస్‌వోలు సాయిరాం, రాజమణి, నర్సాపూర్ రేంజ్ పరిధిలోని బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంప్ సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రుల చెంతకు..

● గంటలోనే అప్పగించిన పోలీసులు



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

నర్సాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : తప్పిపోయిన బాలికను గంటలోనే పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన నర్సాపూర్ పట్టణంలో సోమవారం చోటు చేసుకున్నది. పట్టణంలో నివసించే కాట్రోత్ వసంత, మోహన్ దంపతుల కూతురు అక్షి(6)ని తండ్రి సోమవారం మందలించి, చేయి చేసుకోవడంతో కోపంతో అక్షి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. కంగారు పడ్డ తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఎస్‌ఐ ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు మోహన్, వెంకన్న బస్టాండ్ సమీపంలో ఉన్న బాలికను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. తల్లిదండ్రులను పిలిపించి వారికి అప్పగించారు.



జహీరాబాద్ పట్టణ సమీపంలోని హోతి(కే)లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

మా ఇల్లు మాగ్గావాలె

- డబుల్ లబ్ధిదారుల ఆందోళన
- పట్టాలు ఇచ్చి.. ఇళ్లు ఇవ్వలేదని ఆవేదన
- రోడ్డుపై బైఠాయించి నినాదాలు
- సమయం అడిగిన అధికారులు

జహీరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : డబుల్ బెడ్ రూం ఇళ్ల అప్పగింతలో జాప్యం లబ్ధిదారుల్లో ఆగ్రహం తెప్పిస్తోంది. పట్టాలు ఇచ్చినా.. ఇళ్లు అప్పగించకపోవడంతో జహీరాబాద్ ప్రాంత లబ్ధిదారులు సోమవారం రోడ్డెక్కారు. డబుల్ బెడ్ రూంలు నిర్మించిన తాండూరుకు వెళ్లే ప్రధాన రహదారిపై 'మాకు ఇళ్లు ఎప్పుడు అప్పగిస్తారు' అంటూ ఆందోళనకు దిగారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పి, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలంటూ సలహా ఇచ్చారు. దీంతో లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. తమకు ఇళ్లు ఇచ్చే వరకు కదిలే ప్రసక్తే లేదంటూ భీష్మించుకూర్చున్నారు. దీంతో తహసీల్దార్ దశరథ్ వచ్చి లబ్ధిదారులతో మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి 20 రోజుల్లో ఇళ్లను అప్పగించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అసలేం జరిగింది..

జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 1100 డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించి, అర్హులకు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఈ పనులకు శ్రీకారం చుట్టింది. పట్టణ సమీపంలోని రహ్మత్‌నగర్‌లో 320, కోహీర్ మండలం దిగ్వాల్‌లో 20 ఇళ్ల చొప్పున నిర్మించి, లబ్ధిదారులకు అందజేశారు. హోతి(కే) గ్రామ సమీపంలో 10 ఎకరాల్లో రూ.34.98 కోట్ల వ్యయంతో ఒక్కో బ్లాక్‌లో 24 ఇళ్ల చొప్పున 27 బ్లాకుల్లో కలిపి 700 ఇళ్లను నిర్మించారు. ఇందులో 40 ఇళ్లను పస్తాపూర్‌లో నిర్మించి లబ్ధిదారులకు కేటాయించారు. మిగిలిన 660 ఇళ్లు పూర్తయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో హోతి(కే) గ్రామశివారులోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక హడావుడిగా జరిగింది. అప్పటి మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా పలువురికి గృహ ప్రవేశాలు కూడా చేయించారు. అదే సమయంలో లబ్ధిదారులకు పట్టాలు కూడా పంపిణీ చేశారు. ఇంతలోనే ఎన్నికలు రావడంతో లబ్ధిదారులకు ఇళ్లు మాత్రం అందజేయలేదు. ఈ నేపథ్యంలో సోమవారం లబ్ధిదారులు ఆందోళనకు దిగారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

లబ్ధిదారులకు అప్పగించాలి



హోతి(కే)లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలి. ఇప్పటికే పంపిణీ చేసిన పట్టాల ఆధారంగా ఇళ్లను అప్పగిస్తే, లబ్ధిదారులపై అద్దెల భారం తగ్గుతుంది. ఇళ్లు పంపిణీ చేయకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. వెంటనే ఇళ్లు అందజేయకపోతే ఆందోళనలు చేస్తాం.

- మైపాల్, సీఐటీయూ జిల్లా నాయకులు

సర్టిఫికెట్ ఇచ్చారు..



డబుల్ బెడ్ రూం కోసం అర్హురాలిగా ఎంపిక చేసి పట్టా సర్టిఫికెట్ ఇచ్చారు. కానీ, నాకు కేటాయించిన ఇంటి తాళం ఇవ్వలేదు. పలు మార్లు అధికారులు, నాయకుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. మేము కూలి పనులు చేసుకుంటూ అద్దె ఇంట్లో ఉంటున్నాం. వెంటనే ఇల్లు ఇవ్వాలి.

- పుష్పావతి, హౌసింగ్ బోర్డు, జహీరాబాద్

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

- చిన్నశంకరంపేటలో బీజేపీ ఆందోళన



ఎంపీపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్న బీజేపీ కార్యకర్తలు

చిన్నశంకరంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ మహిళామోర్చా ఆధ్వర్యంలో మెదక్ జిల్లా చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయం ఎదుట బీజేపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. కొందరు కార్యకర్తలు కార్యాలయం పైకి ఎక్కి నిరసన తెలిపారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ మాట్లాడుతూ బూటకపు మాటలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గద్దె దిగాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ పేదలకు అనుకూలంగా లేదని, కాంగ్రెస్ కార్యకర్తలకే అనుకూలంగా మార్చుకొని ఇండ్ల మంజూరులో నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎస్సై నారాయణగౌడ్ తన సిబ్బందితో వచ్చి ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు. వినకపోవడంతో వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రాజు, జిల్లా నాయకులు మల్లారెడ్డి, సురేష్‌గౌడ్, మూర్తి శంకర్, నరేందర్ రెడ్డి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు మంజుల, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల రాజు పాల్గొన్నారు.



ఎంపీపీ కార్యాలయం పైకి ఎక్కి నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

ఏడుపాయల సన్నిధిలో ఎస్పీ



ఏడుపాయల వన దుర్గామాతను దర్శించుకుంటున్న మెదక్ ఎస్పీ శ్రీనివాస్ దంపతులు

పాపన్నపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న శ్రీనివాస్ సోమవారం కుటుంబసమేతంగా ఏడుపాయల వన దుర్గామాతను దర్శించుకున్నారు. తొలిసారి ఏడుపాయలకు వచ్చిన ఎస్పీ కుటుంబసభ్యులకు అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం సత్కరించి, ఆశీర్వచనాలతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పూజారి శంకర్‌శర్మ, దేవస్థానం సిబ్బంది పాపన్నపేట, కొల్చారం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుపాయల్లో సినీనటుడు నరేష్ సందడి



నరేష్‌ను శాలువాతో సన్మానిస్తున్న అర్చకుడు

అలాగే ప్రముఖ సినీనటుడు నరేష్ సోమవారం ఏడుపాయల్లో సందడి చేశారు. స్నేహితులతో ఏడుపాయలకు వచ్చిన ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు పార్థివశర్మ ప్రత్యేక పూజల అనంతరం నరేష్‌కు తీర్థ ప్రసాదాలు వితరణ చేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ కొత్త సినిమా ప్రాజెక్ట్ మొదలుపెడుతున్నందున ఇబ్బందులు తలెత్తకుండా అమ్మవారిని దర్శించుకునేందుకు ఏడుపాయలకు వచ్చామని తెలిపారు. నరేష్‌తో పలువురు సినీ నిర్మాతలు ఉన్నారు. నరేష్‌తో ఫొటోలు దిగేందుకు భక్తులు పోటీపడ్డారు.

కేసుల రాజీతో స్నేహభావం పెంపు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

సంగారెడ్డి క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కేసుల రాజీతోనే స్నేహభావం మరింత పెంపొందుతుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర అన్నారు. ఈనెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా కోర్టు సమావేశ మందిరంలో సోమవారం పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ చేయదగ్గ పోలీస్ కేసులు, భార్యాభర్తల చిన్నచిన్న వివాదాలు, ఎక్సైజ్ కేసులు, బ్యాంక్ కేసులు తదితర కేసులు పరిష్కరించుకోవాలన్నారు. క్షణికావేశంలో ఇరువర్గాలు చిన్నచిన్న తగాదాలు పడి కేసులు నమోదై కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా కోర్టులో తమపై ఉన్న కేసులను రాజీచేసుకుని సామరస్యంగా స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలని సూచించారు. పోలీసు శాఖ తరఫున ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా పోలీసులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అనిత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.ధనలక్ష్మీ, ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయాధికారి డి. దుర్గా రాణి, జిల్లా అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, సిఐలు, ఎస్ఐలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి భవానీచంద్ర

నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలవాలి

- ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య

హుస్నాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నక్సలైట్లు తుపాకులు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని సోమవారం హుస్నాబాద్ పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న స్వర్గీయ ఎస్ఐ జాన్ విల్సన్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ మావోయిస్టుల పేరుతో రాజ్యాంగ విరుద్ధంగా, కేవలం తుపాకీతోనే రాజ్యాధికారం సాధ్యమని కొన్ని వేల ప్రాణాలు తీసిన నక్సలైట్లకు వ్యతిరేకంగా ఈ ర్యాలీ జరిపామన్నారు. మావోయిజానికి మద్దతుగా అర్బన్ నక్సలైట్లు, కమ్యూనిస్టులు శాంతి చర్చలు జరుపాలని అంటున్నారని, ఇన్ని రోజులు నక్సలైట్లు ఆదివాసీలను, గిరిజనులను, దళితులు ఎస్ఐ జాన్‌విల్సన్, సీఐ యాదగిరి, శ్రీపాదరావు లాంటి వారిని అన్యాయంగా చంపినప్పుడు శాంతి చర్చలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. మేధావులుగా చలామణి అవుతున్న అర్బన్ నక్సలైట్లు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతి కలిసి నిజమైన అభివృద్ధిలో పాల్గొనేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి రాకేష్, రాజేష్, రాజు, చరణ్, అంజి తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

భూ పట్టాలు ఇవ్వాలి



గజగట్లపల్లిలో రెవెన్యూ సదస్సు వద్ద పట్టా పాస్ పుస్తకాలతో నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

చిన్నశంకరంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : తాత ముత్తాతల నుంచి సాగుచేస్తున్న భూములకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం చిన్నశంకరంపేట మండలంలోని గజగట్లపల్లిలో రెవెన్యూ అధికారులు భూభారతి సదస్సు నిర్వహించారు. 404 సర్వే నెంబర్ భూమిలో కాస్తులో ఉండి పంటలు సాగు చేస్తున్నామని రెవెన్యూ సదస్సులో బాధిత రైతులు దరఖాస్తు చేసుకున్నారు. తమ భూ ములకు గత ప్రభుత్వాలు పట్టాలు అందజేశారని పట్టాదారు పాసుపుస్తకాలు చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్ ద్వారా తమకు అన్యాయం జరుగుతుందని ఆన్లైన్లో మా పేర్లు నమోదు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మన్నన్ మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సులో భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

స్వచ్ఛందంగా వెల్దుర్తి బంద్

- మార్వాడీలు దుకాణాలు ఏర్పాటు చేయొద్దు



వెల్దుర్తిలో స్వచ్ఛందంగా బంద్ చేసిన దుకాణాలు

వెల్దుర్తి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి పట్టణంలో నూతనంగా మార్వాడీలు దుకాణాలు ఏర్పాటు చేయవద్దని వెల్దుర్తి వ్యాపారస్తులు సోమవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి బస్టాండ్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు మాట్లాడుతూ.. మార్వాడీలు దుకాణాలను ఏర్పాటు చేసి స్థానికంగా వ్యాపారం చేస్తున్న వారిని దెబ్బతీస్తున్నారని, కాగా కొత్త దుకాణాలు ఏర్పాటు చేయవద్దని గతంలోనే వ్యాపారస్తుల సమక్షంలో తీర్మానం చేయడం జరిగిందన్నారు. దీనికి విరుద్ధంగా వెల్దుర్తిలో మరో దుకాణం ఏర్పాటు చేయడానికి యత్నించగా వ్యాపారస్తులు అడ్డుకున్నారు. అనంతరం వెల్దుర్తిలో వ్యాపారస్తులు సమావేశం నిర్వహించి మార్వాడీలు కొత్తగా దుకాణాలను ఏర్పాటు చేయవద్దని మళ్లీ తీర్మానం చేశారు.

అవినీతిని వెలికితీసేందుకు తనిఖీలు

నిజాంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకంలో అవినీతి జరగకుండా, జరిగిన అవినీతిని వెలికితీసేందుకే సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నామని సామాజిక తనిఖీల అదనపు పీడీ రంగాచారి, డీవీవో శ్రీహరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికల్లో 2024-25 సంవత్సర ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామాలవారీగా జరిగిన ఉపాధి పనుల లోటుపాట్లపై సిబ్బందిని వివరణ కోరారు. పనుల్లో మస్టర్లలో సంతకాలు లేకపోవడం, ఒకరికి బదులు ఇంకొకరు రావడం, హరితహారంలో నాటిన మొక్కలు చనిపోవడంపై కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు కలిపి రూ.8 వేల జరిమానా విధించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదలకు ఉపాధి కల్పించాలన్న ఆలోచనతో చేపడుతున్న పనులను అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. ఏడాదిలో కూలీలు, మెటీరియల్ కలిపి మొత్తం రూ.3 కోట్ల పనులు జరిగాయని, దీని నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి అరుణ, జిల్లా కార్యాలయ అధికారి రాజేందర్, అసిస్టెంట్ డీవీవో సంపత్, ఏపీవో, ఎంపీడీవో, ఎంపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

ఏరువాక సాగేదెలా?

5వ పేజీ తరువాయి

తప్పడం లేదు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా యాంత్రీకరణ వైపు దృష్టి సారించాలని రైతులకు సూచిస్తున్నారు. ఈ యంత్రాలతో చేసే పనులకు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. వీటికి డీజిల్ ఖర్చులు రైతులపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. పాత పద్ధతుల్లో సాగు చేయలేక, కొత్త పద్ధతులకు మారడంలో పెట్టుబడుల భారం పడుతుండడంతో రైతులు సతమతమవుతున్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు మరీ ఇబ్బందికరంగా ఉంది.

దుక్కుల నుంచి పంట విక్రయం వరకు భారీగా ఖర్చులు

సీజన్ ప్రారంభంలో దుక్కి దున్నడం మొదలుకుని, పంట చేతికి వచ్చి మార్కెట్‌లో విక్రయించేదాకా పెట్టుబడులు పెట్టాల్సిందే. ట్రాక్టర్‌తో దుక్కి దున్నించడానికి పనిని బట్టి గంటకు కిరాయి తీసుకుంటున్నారు. కల్టివేటర్, రోటోవేటర్, ప్లవ్ వంటివి వేసేందుకు కూడా గంటల చొప్పున చార్జీలు వసూలు చేస్తున్నారు. ఎకరం భూమి దున్ని పత్తి, మొక్కజొన్న సాగుచేసేందుకు దాదాపు రూ.12 వేల వరకు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టర్ చార్జీలు కూడా పెరిగాయని, గడిచిన వానాకాలం, యాసంగి సీజన్లతో పోలిస్తే ఈ ఏడాది మరింత ఖర్చులు పెరిగిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాలలకు బాలసాహిత్యం అవసరం



'ఊగుతున్న ఉయ్యాల' బాల గేయాలు ఆవిష్కరణలో కవులు జాసాప ప్రతినిధులు

సిద్దిపేట కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : చిట్టి పొట్టి పదాల కూర్పుతో, తేనెలూరు గేయ మధురిమల మేళవింపు గలిగిన బాలగేయాలు బాలల లోకంలో విహరిస్తాయని జాసాప (జాతీయ సాహిత్య పరిషత్) అధ్యక్షుడు ఎన్నవెళ్లి రాజమౌళి అన్నారు. ప్రతినెల మన బాల సాహిత్యం కార్యక్రమంలో భాగంగా నల్గొండకు చెందిన కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రచించిన 'ఊగుతున్న ఉయ్యాల' బాల గేయాలు సిద్దిపేటలో ఆవిష్కరణ చేశారు. బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం మాట్లాడుతూ నేడు బాలలకు బాలసాహిత్యం ఎంతో అవసరమంటూ బాలసాహిత్యంలో బుచ్చిరెడ్డి చేస్తున్న కృషి అమోఘం అన్నారు. కవి, గాయకులు వరుకోలు లక్ష్మయ్య మాట్లాడుతూ బాలలకు మాత్రానుగుణమైన గేయాలు అందాలన్నారు. శ్రీవాణి సాహిత్య పరిషత్ అధ్యక్షుడు పెందోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిద్దిపేట బాలసాహిత్యానికి ఇంకా ఎంతగానో ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. కవి మిట్టపల్లి పరశురాములు మాట్లాడుతూ బాలలకు బాలసాహిత్య పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. యువ కవి బస్వరాజ్ కుమార్ మాట్లాడుతూ బాలసాహిత్యం సమాజ శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

దుబాయిలో మట్టి మేధావి సత్తయ్య పుస్తకావిష్కరణ

- వక్తగా హాజరైన తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ భరత్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రామచంద్రాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సంక్షేమం, అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా అహర్నిశలు తపించే శ్రమశక్తి అవార్డు గ్రహీత కొల్లూరి సత్తయ్య జీవిత చరిత్రను వివరిస్తూ డాక్టర్ పసునూరి రవీందర్ రచించిన 'మట్టి మేధావి సత్తయ్య' పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. దుబాయిలో 'గల్ఫ్ అంబేద్కరైట్స్ మూమెంట్' సంస్థ ఆధ్వర్యంలో భారతదేశ మహనీయులైన ఛత్రపతి శివాజీ, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్‌ల జయంతిని ఘనంగా నిర్వహించారు. తెల్లాపూర్ నుంచి హాజరైన భరత్ మాట్లాడుతూ కార్మిక, శ్రామికవర్గానికి శివాజీ, పూలే, అంబేద్కర్లు చేసిన పోరాటాలు, ఉద్యమాలు, కృషిని దుబాయి కార్మికులకు తెలియజేసేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. అస్పృశ్యత, అసమానతల నిర్మూలన కోసం అంబేద్కర్ చేసిన కృషి అనిర్వచనీయమని కొనియాడారు.

ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ మ్యాచ్ విజేత సంగారెడ్డి



మొదటిస్థానంలో నిలిచిన సంగారెడ్డి ఏ జట్టు

సంగారెడ్డి అర్బన్/కొండాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ మ్యాచ్ విజేతగా సంగారెడ్డి నిలిచింది. కొండాపూర్ మండల చీమలదారి కోనాపూర్ ఎం.ఎ.క్రికెట్ మైదానంలో సోమవారం సంగారెడ్డి-ఏ, సిద్దిపేట-బీ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ ప్రారంభించిన సిద్దిపేట-బీ జట్టు నిర్ధారిత 40 ఓవర్లలో 22.5 ఓవర్లకు 100 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సంగారెడ్డి-ఏ జట్టు 22.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేసి విజయం సాధించింది. కాగా సంగారెడ్డి-ఏ జట్టు ఐదు మ్యాచ్‌లలో ఒక ఓటమితో లీగ్‌లో మొదటిస్థానంలో ఉన్నదని ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ.రాజేందర్‌రెడ్డి తెలిపారు.

అక్రమంగా తీసుకొస్తున్న గోవా మద్యం పట్టివేత



తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

జహీరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని గోవా నుంచి తెలంగాణకు అక్రమంగా తీసుకొస్తున్న 17 బాటిళ్ల గోవా మద్యాన్ని సోమవారం పట్టుకున్నామని ఎస్టీఎఫ్ సీఐ బిక్షారెడ్డి, టీటీఎఫ్ సీఐ హన్మంతు, చెక్‌పోస్టు సీఐ మల్లికార్జున్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద సోమవారం వాహనాల తనఖీలు చేపట్టారు. అందులో భాగంగా గోవా నుంచి తెలంగాణకు వస్తున్న ట్రావెల్ బస్సును తనిఖీ చేయగా.. అందులో పలువురు పర్యాటకుల వద్ద 17 బాటిళ్ల గోవా మద్యం లభించిందన్నారు. ఈ మేరకు మద్యాన్ని స్వాధీనం చేసుకుని, మరోసారి అక్రమంగా మద్యం తీసుకురావద్దని ప్రయాణికులను హెచ్చరించారు.

పగలే వెన్నెల



సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడిపేట గ్రామంలో పట్టపగలు వీధి దీపాలు వెలుగుతున్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ దుర్వినియోగం అవుతుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇవే కాకుండా ఎలాంటి సమస్యలను కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ వినియోగం దుర్వినియోగం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

- సంగారెడ్డి రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి)

ఓఆర్ఆర్ అనుసంధానం పనులకు మోక్షమెన్నడో?



కర్ధనూరు అవుటర్ వంతెన వద్ద అధ్వానంగా రోడ్డు



కర్ధనూరు కూడలి వద్ద మధ్యలో ఆగిన పాశమైలారం రోడ్డు పనులు

పాశమైలారం పారిశ్రామికవాడకు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఔటర్‌కు అనుసంధానం చేసే ప్రక్రియ పనుల్లో తీవ్ర జాప్యం కారణంగా ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొన్నది. తెల్లాపూర్ పురపాలక పరిధి కర్ధనూరు అవుటర్ జంక్షన్ వద్ద కూడలి నిర్మాణ పనులు కొనసాగడంలేదు. దీంతో ఉదయం సాయంత్రం సమయాల్లో నిత్యం వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ స్తంభించి నరకాన్ని చవిచూడాల్సి వస్తోంది. పోలీసులు నిత్యం కసరత్తు చేయకతప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి కూడలి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- రామచంద్రాపురం టౌన్ జూన్ 9 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

వెల్దుర్తి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అందుగులపల్లి గ్రామంలో సోమవారం ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జాకు యత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడిపల్లి వెళ్లే రోడ్డు వెంట ఉన్న అసైన్డ్ భూమిని చుట్టు పక్కల ఉన్న వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో అసైన్డ్ భూమిలో ఉన్న దారిని మూసివేసి బండ రాళ్లను అడ్డుగా వేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్థులు స్థలం వద్దకు వెళ్లి రోడ్డును ఎలా మూసివేస్తారని కబ్జాకు యత్నిస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

హెచ్‌ఎంను అభినందించిన సంగారెడ్డి కలెక్టర్



హెచ్‌ఎం రామకృష్ణను అభినందిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి గ్రీన్ ఛాంపియన్ పురస్కారం అందుకున్న సదాశివపేట మండలం నిజాంపూర్ కె ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణను సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా నిజాంపూర్ కె పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన పాఠశాల కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సెక్టోరియల్ అధికారి వెంకటేశం, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతితో మరింత బాధ్యత: ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పదోన్నతి ద్వారా బాధ్యత మరింత పెరుగుతుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు ఎస్‌ఐలు వెంకట్‌రెడ్డి, ప్రసాద్‌రావులకు సీఐలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు మల్టీ జోన్ 2 ఐజీ వి.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ పంకజ్ వారిని అభినందిసూ ఇన్‌స్పెక్టర్ ర్యాంకు చిహ్నం ధరింపజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్తమ సేవలందించి పోలీసు శాఖకు మంచి పేరు తేవాలన్నారు.

ప్రజావాణిలో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించండి





ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా జిల్లాల కలెక్టరేట్‌లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి సంబంధిత జిల్లాల్లోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్లు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు.

సంగారెడ్డిలో 61 ఫిర్యాదులు

సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 61 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. అందులో ముఖ్యమైనవి కొన్ని ఇలా ఉన్నాయి.. సదాశివపేట మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన అహ్మద్ హుసేన్ తన మ్యుటేషన్ గురించి దరఖాస్తు చేసుకుని కార్యాలయానికి తిరిగినా పరిష్కరించడం లేదని, ఇప్పటికైనా న్యాయం చేయాలని అర్జీలో కోరాడు. సదాశివపేట మండలం గొల్లగూడెం గ్రామంలో ప్రభుత్వ భూమి, శ్మశానవాటికను కొందరు ఆక్రమించి పంట పొలాలకు వెల్లకుండా ఫెన్సింగ్ వేశారని, వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో రోడ్డు, డ్రైనేజి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలో కాలనీవాసులు కోరారు. వచ్చి అర్జీల్లో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించినవే ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజరాణి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో 50..

మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 50 అర్జీలు అందాయి. ఇందులో ధరణి 23, ఇళ్లకు సంబంధించి 2 రుణమాఫీ 2, ఇతర సమస్యలకు సంబంధించినవి 23 అర్జీలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి: ఎస్పీ

మెదక్ అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే
మెరుగైన విద్య,

నిజాంపేట/మనోహరాబాద్/మనూరు/కంగ్టి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని పలు మండలాల్లో సోమవారం బడిబాట కార్యక్రమం ముమ్మరంగా కొనసాగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా విద్యా బోధన ఉంటుందని, అలాగే ప్రభుత్వం విద్యార్థులకు కల్పించే సౌకర్యాలు, ప్రాధాన్యతలపై వివరించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన, నూతన పద్ధతిలో ఏఐ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడుల్లో కల్పించే సౌకర్యాలపై తల్లిదండ్రులకు వివరించారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామంలో ఉపాధ్యాయులు బాడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాణి, ఉమాదేవి, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉసిరికపల్లి, డోవూరు, తిమ్మాపూర్ తండా, తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ ర్యాలీ నిర్వహించారు. సర్కారు బడుల్లో పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య అందిస్తున్నట్టు తెలిపారు.

ప్రతి చిన్నారిని అంగన్‌వాడీలో చేర్పించాలి

చిన్నశంకరంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రెండు నుంచి ఐదేళ్ల లోపు వయసు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 'అమ్మ ఒడి' అంగన్‌వాడీ కార్యక్రమంలో భాగంగా చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బహుజనుల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం



శివానగర్‌లో ముదిరాజ్ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న నీలం మధు

జిన్నారం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బహుజనుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ కాంటెస్టెట్ అభ్యర్థి నీలం మధు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని శివానగర్‌లో రూ.15లక్షల సొంత నిధులతో నిర్మించిన ముదిరాజ్ సంఘ భవనాన్ని నీలం మధు ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బహుజనులు, ముదిరాజ్‌లకు ప్రత్యేక గుర్తింపునిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు వడ్డె కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యత

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

గుమ్మడిదల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం గుమ్మడిదల మండలం మున్సిపల్ పరిధిలో రూ.12.80 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

మంత్రివర్గంలో మైనార్టీలకు అవకాశం కల్పించాలి

జహీరాబాద్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో మైనార్టీలకు అవకాశం కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధిసంస్థ మాజీ చైర్మన్ నరోత్తం పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మంత్రివర్గంలో మైనార్టీలకు అవకాశం ఎందుకు కల్పించడంలేదని ప్రశ్నించారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు మహ్మద్ సలీం, ఫర్వేజ్‌పాటీల్, సోహెల్, నబిసాబ్ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలేవీ?

రామచంద్రాపురం టౌన్ జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి చెప్పారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని వివరించారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

తూప్రాన్/మాసాయిపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామంలో సోమవారం బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. మోదీ 11ఏళ్ల సుపరిపాలన పేదల సంక్షేమం పురస్కరించుకొని వికసిత్ భారత్ అమృతకాలం సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరూరా మొక్కలు నాటుతున్నట్లు మండల బీజేపీ అధ్యక్షుడు పిట్ల పోచయ్య ముదిరాజ్ పేర్కొన్నారు. అదేవిధంగా మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలపై మాసాయిపేట మండల కేంద్రంలో సోమవారం సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ములుగు నాగేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

వట్‌పల్లి,జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరువెల్లిలో ఓ ఫర్టిలైజర్ షాపులో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించిన వివరాలు ధరల పట్టిక, రికార్డులు సరిగా లేకపోవడంపై విజిలెన్స్ ఏఐజీ అధికారి మధుకర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవో కోటేశ్వర్‌రెడ్డి ఆ యజమానికి నోటీస్ జారీ చేశారు.

బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల అవగాహన సదస్సు

సంగారెడ్డి రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి కోర్టు ఎదుట గల కార్యాలయంలో సోమవారం బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఏజీఎం జగన్ రావు బీఎస్ఎన్ఎల్ మోబైల్ సిగ్నల్స్, 4జీ కవరేజీ, ఎఫ్‌టీటీహెచ్ సర్వీస్ ప్లాన్, సైబర్ క్రైమ్, ఫ్రాడ్ కాల్స్, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

నేడు మున్సిపల్ వార్డు విభజన అభ్యంతరాలపై సమావేశం

జిన్నారం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో వార్డుల వారీగా ఓటర్ల విభజన అభ్యంతరాలపై ఈ నెల 10న సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జైత్‌రాంనాయక్ తెలిపారు. ఈనెల 10న ఉదయం 11:30గంటలకు మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

'కేతకీ' పాలక మండలి ప్రమాణ స్వీకారం

ఝరాసంగం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ పాలక మండలి సభ్యులుగా ఝరాసంగం గ్రామానికి చెందిన మల్లయ్య స్వామి, నారాయణఖేడ్ సమీపంలోని తుర్కపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరయ్యలచే సోమవారం మెదక్ డివిజన్ ఆలయ ఇన్‌స్పెక్టర్ రంగరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

జడ్పీ మాజీ చైర్మన్ రామకృష్ణ అనారోగ్యంతో మృతి



రామకృష్ణ (ఫైల్)

జిన్నారం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ డి.రామకృష్ణ కన్నుమూయగా.. స్వగ్రామంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని కాజీపల్లికి చెందిన మాజీ జడ్పీ చైర్మన్ రామకృష్ణ (76) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మరణించాడు. రామకృష్ణ 1986-91వరకు టీడీపీ తరుపున జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేశారు.

ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

సంగారెడ్డి అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) 79 వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డిలోని ఎస్టీయూ భవన్‌లో సంఘం పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ ఆవిష్కరించారు.

పలు మండలాల్లో వర్షం



ఖేడ్‌లో జాతీయ రహదారిపై పారుతున్న వర్షపునీరు



రేగోడులో కురుస్తున్న వర్షం

నారాయణఖేడ్/పెద్దశంకరంపేట/ రేగోడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో సోమవారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఖేడ్ డివిజన్ పరిధిలో సోమవారం ఉదయం 7 గంటల సమయంలో గంట పాటు ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులతో కుండ పోత వర్షం కురిసింది. మనూరు, ఖేడ్, నాగల్‌గిద్ద మండలాల్లోని పలు వాగులు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మనూరులో 42.4 మి.మీలు, ఖేడ్‌లో 35, నాగల్‌గిద్దలో 34.6, నిజాంపేటలో 27.4, కంగ్టిలో 24, సిర్గాపూర్‌లో 9.4, కల్హేర్‌లో 6.8 మి.మీలుగా నమోదైంది. పెద్దశంకరంపేటలో సోమవారం ఉదయం 5గంటల నుంచి 10 గంటల వరకు వర్షం కురిసింది. దీంతో పెద్దశంకరంపేటలోని పలు మురికి కాలువలు పొంగి పొర్లడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతర్గత రహదారులు చిత్తడి చిత్తడిగా మారాయి. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రేగోడు మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. 5 గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేరు. 34మిల్లీమీటర్ల వర్షం కురిసిందని తహసీల్దార్ దత్తారెడ్డి తెలిపారు.

పంటల మార్పిడితో చీడపీడలను తగ్గించవచ్చు



మనోహరాబాద్: గౌతోజీగూడలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తూప్రాన్/మనోహరాబాద్/హవేళిఘణపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పంటల మార్పిడితో చీడపీడలను తగ్గించుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సోమవారం తూప్రాన్ మండలం నర్సంపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. వరప్రసాద్, కీటక శాస్త్రవేత్త డా. రాజశేఖర్, టీచింగ్ అసోసియేట్ డా. సౌమ్యలు పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని గౌతోజీగూడా, కాళ్లకల్ గ్రామాల్లో తెలంగాణ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేతలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయలక్ష్మి, మండల ఏవో స్రవంతి, టీచింగ్ అసోయేట్, నరేందర్ శాస్త్రవేతలు పాల్గొన్నారు. హవేళిఘణపూర్ మండలంలోని శమ్నాపూర్, గంగాపూర్ గ్రామాల్లో రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త శ్రీనివాస్ సోమవారం రైతులకు భూసార పరీక్షల వల్ల కలిగే లాభాలు, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం, అధిక దిగుబడినిచ్చే వంగడాలు, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాపారావు, బస్వరాజు, పరమేశ్వరి, ఏఈవోలు ప్రశాంత్, రాకేష్, మాజీ సర్పంచ్ వెంకటి, రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న టీయూడబ్ల్యూజే నాయకులు

సంగారెడ్డి రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉన్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులో వంద శాతం రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం డీఈవో వెంకటేశ్వర్లుకు టీయూడబ్ల్యూజే నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి తమ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ఉపాధ్యక్షుడు ఎంఏకే. ఫైజల్, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ అధ్వర్యంలో కృషి చేస్తున్నామన్నారు. గతంలో కొన్ని విద్యాసంస్థలు డీఈవో ఉత్తర్వులను కూడా అమలు చేయలేదని గుర్తు చేశారు. ఈ సారి అలా కాకుండా ఖచ్చితంగా అమలు చేసే విధంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన డీఈవో వంద శాతం రాయితీ అందేవిధంగా చూస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎలాక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షుడు ఎండి సిద్దిక్, ఫోటో జర్నలిస్టుల సంఘం నాయకుడు ఆరీఫ్, శ్యాంసుందర్, సీనియర్ జర్నలిస్టులు రవి, పంజ్యోతి, నాగరాజుగౌడ్, రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం

కోహీర్/కంగ్టి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం అవుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త కె. ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కోహీర్ మండలంలోని సజ్జాపూర్ గ్రామంలో పలు వార్డులో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. అనంతరం 15 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

కంగ్టి మండల పరిధిలోని గాజుల్‌పాడ్‌లో రియానా బేగంకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులకు ఎంపీడీవో సత్తయ్య సోమవారం శంకుస్థాపన చేశారు.

తడ 'బడి'

(5వ పేజీ తరువాయి)

సోమవారం 'ఆంధ్రజ్యోతి' పాఠశాలల విజిట్‌లో వెలుగు చూశాయి.

ఎక్కడి పనులు అక్కడే

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు పాఠశాలలు ఏళ్ల తరబడి సమస్యలతో సతమతం అవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి పథకం ద్వారా కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. కొద్దిరోజుల తర్వాత పనుల వేగం తగ్గింది. పలు చోట్ల అసంపూర్తిగానే మిగిలియా. ప్రస్తుత ప్రభుత్వం హయాంలోనూ అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట మరికొన్ని స్కూళ్లను ఎంపికచేసి పనులు చేపట్టారు. ఆ పనులు కూడా అర్థాంతరంగానే నిలిచిపోయాయి. పాఠశాలల్లో కనీస వసతులను కల్పించాలనే లక్ష్యం నెరవేర లేదు. నెల న్నర సెలవులు వచ్చినప్పటికీ చాలాచోట్ల తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదు. దీంతో, పాఠశాలల్లో మరమ్మతు పనులన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా వెక్కిరిస్తున్నాయి. రెండ్రోజుల సమయం ఉన్నందున కనీసం తాత్కాలిక మరమ్మతులు చేయాల్సిన బాధ్యతను జిల్లా యంత్రాంగం గుర్తించడం లేదు. దీంతో, పలు పాఠశాలల్లోని శిథిల భవనాలతో వర్షాకాలంలో విద్యార్థులకు ముప్పు వాటిల్లే ప్రమాదం నెలకొన్నది.

సర్దుబాటుపై వివాదం

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఎస్జీటీలు 1,791, స్కూల్ అసిస్టెంట్లు 1,600 మంది ఉన్నారు.

ఉత్తర్వులు రద్దు చేయాలి



ప్రాథమిక విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా ఉన్న సర్దుబాటు ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలి. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించి పర్యవేక్షణ పెంచితే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది.

-కొంగటి యాదగిరి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ పాఠశాలలపై తీవ్ర ప్రభావం



పాఠశాలల ప్రారంభం వరకు విద్యార్థుల సంఖ్య ఎంత ఉండబోతుందనేది పరిగణలోకి తీసుకోకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను ఉపక్రమించడం సరికాదు. ప్రస్తుతం విద్యాశాఖ చేపట్టిన సర్దుబాటు ప్రక్రియ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయంతో భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి.

-చల్లా లక్ష్మణ్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం



జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తాం. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. క్షేత్ర స్థాయిలో ఎంత మంది ఉపాధ్యాయులు సర్‌ప్లస్‌గా ఉన్నారనేది నివేదికలు ఇవ్వాలని ఎంఈవోలను ఆదేశించాం. వారిచ్చే సమాచారంతో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం.

- రాధాకిషన్, డీఈవో మెదక్

రైతుల సమస్యలు పరిష్కరించేందుకే సదస్సులు

నర్సాపూర్/తూప్రాన్/రేగోడు/పాపన్నపేట/వెల్దుర్తి/హవేళిఘణపూర్/మనోహరాబాద్/ , జూన్ 9(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు సదస్సులకు హాజరై రైతుల సందేహాలను నివృతి చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ.. రైతుల సమస్యలు పరిష్కరించేందుకే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నర్సాపూర్ మండలం రుస్తుంపేటలో నిర్వహించిన సదస్సుకు ఆర్డీవో మహిపాల్ హాజరయ్యారు. తూప్రాన్ మండలం కిష్టాపూర్, వెంకటాయపల్లి గ్రామాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఆర్డీవో జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. తూప్రాన్ రెవెన్యూ డివిజన్‌లో ఇప్పటి వరకు 2,183 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. రేగోడు మండలంలోని టి లింగంపల్లిలో రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ దత్తారెడ్డి ఫిర్యాదులను స్వీకరించారు. పాపన్నపేట మండలం తమ్మాయపల్లిలో జరిగిన భూభారతి కార్యక్రమంలో 40 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సతీష్‌కుమార్ తెలిపారు. వెల్దుర్తి మండలంలోని బండపోసన్‌పల్లి, మన్నెవారిజలాల్‌పూర్ గ్రామాల్లో అధికారులు సదస్సులు నిర్వహించారు. హవేళిఘణపూర్ మండలంలోని మద్దుల్వాయిలో సదస్సును మెదక్ ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. మనోహరాబాద్ మండలం కూచారంలో 49 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

వక్ఫ్‌బోర్డు నుంచి మా భూములను తొలగించండి

మునిపల్లి, జూన్9 (ఆంధ్రజ్యోతి): మునిపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో గల 1 నుంచి 90వ సర్వే నెంబర్ వరకు తమ పట్టా భూములు వక్ఫ్ బోర్డులో చూపిస్తున్నాయని రైతులు వాపోయారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆ శాఖ అధికారుల వద్ద గ్రామస్థులు, రైతులు మొరపెట్టుకున్నారు తాత, ముత్తాతల నుంచి పట్టా భూములుగా ఉన్న తమ భూములు వక్ఫ్ బోర్డులోకి ఎలా మారాయని అధికారులను ప్రశ్నించారు. తమ భూములకు సంబంధించి వక్ఫ్ బోర్డు నుంచి తొలగించాలని అధికారులను కోరారు. ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్తే ఎమ్మార్వో నిర్లక్ష్యంగా జవాబిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.